క్లుప్తంగా

నేడు శ్రీక్రిష్ణస్వామి ముదిరాజ్ జయంతి

కాచిగూడ: తెలంగాణ ముదిరాజ్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పుట్టి యాదగిరి ముదిరాజ్ ఆధ్వర్యంలో మాజీ మేయర్ శ్రీకృష్ణస్వామి ముదిరాజ్ జయంతిని 25న శుక్రవారం అంబర్‌పేట, అశోక్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు సంఘం ప్రతినిధి పొట్లకాయల వెంకటేశ్వర్ ముదిరాజ్ తెలిపారు. ఈ వేడుకలకు కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, మహమూద్ అలీ, ఎంపీలు ఆర్.కృష్ణయ్య, డాక్టర్ కె.లక్ష్మణ్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, ఈటల రాజేందర్, మేయర్ గద్వాల విజయలక్ష్మి తదితరులు హాజరవుతారని ఆయన తెలిపారు.

రోడ్ల సమగ్ర అభివృద్ధికి కృషి



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు, కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

అంబర్‌పేట: రోడ్ల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు. గురువారం అంబర్‌పేట డివిజన్ ప్రేమ్‌నగర్‌లో రూ.35 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు మౌలిక వసతులు కల్పించడానికి నిరంతరాయంగా కృషి చేస్తున్నట్లు ఆయన చెప్పారు. జీహెచ్‌ఎంసీ అధికారులు విశ్వజిత్, యాదగిరి రెడ్డి, స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అభినందనలు



ఎమ్మెల్యేను అభినందిస్తున్న గంగపుత్ర అభివృద్ధి సంస్థ కార్యవర్గ సభ్యులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఎమ్మెల్యే ముఠా గోపాల్ 2వసారి ఎమ్మెల్యే టికెట్ లభించినందుకు హర్షం వ్యక్తం చేస్తున్న తెలంగాణ రాష్ట్ర గంగపుత్ర అభివృద్ధి సంస్థ కార్యవర్గ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ తమ మద్దతు తెలిపారు. అనంతరం ముఠా గోపాల్‌ను బోకే శాలువాతో ఘనంగా సన్మానించారు. గంగపుత్ర అభివృద్ధి సంస్థ కార్యవర్గ సభ్యులు గాలి సత్యనారాయణ, రాసకట్ల సురేష్, ఆనంద్, హనుమాన సుధాకర్, యాదగిరి, కొలకొండ సారంగపాని, లెల్లల బాలచందర్, ఎల్లయ్య, పి.శంకర్ తదితరులున్నారు.

కాంగ్రెస్ పార్టీ టికెట్‌కు సంగిశెట్టి దరఖాస్తు

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం టీపీసీసీ ఉపాధ్యక్షుడు సంగిశెట్టి జగదీష్ దరఖాస్తు చేసుకున్నారు. ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇస్తే తప్పకుండా విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు శ్రీరాముల యాదగిరి, సమద్, ఆంజయ్యగౌడ్, జి.ఎస్.చారి, రామకృష్ణ, నవీన్‌కుమార్, నాగేంద్ర, బన్నీ, కీరం, తేజగౌడ్, దినేష్, రాపోలు రమేష్, పుట్ట రమేష్,సురేష్, చిన్న, రవికుమార్ తదితరులున్నారు.

క్రైస్తవుల సంక్షేమానికి కృషి చేయడం అభినందనీయం

చిక్కడపల్లి: క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన రాజేశ్వర్‌రావును గోల్కొండ చౌరస్తాలోని హెబ్రోన్ చర్చి సొసైటీకి చెందిన పలువురు సభ్యులు గురువారం ఆయనను కలిసి అభినందించారు. అనంతరం సొసైటీ చైర్మన్ జోసఫ్ కురియస్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా చర్చిలో నిర్వహించిన సమావేశంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి ఆర్.వీరాచారి (పీతరాచారి) మాట్లాడుతూ.. ప్రభుత్వానికి క్రైస్తవుల పట్ల సానకూలతతో ఉండడంతో పాటు క్రైస్తవులు సంక్షేమం, అభివృద్ధికి చర్యలు తీసుకోవడం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట: శివానందనగర్ బస్తీలో రూ.39 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేయనున్న సీసీ రోడ్డు పనులను గురువారం అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక బస్తీలో ఎమ్మెల్యే అధికారులు, సిబ్బందితో కలిసి పాదయాత్ర నిర్వహించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మూతపడ్డ రోడ్లతో అవస్థలు



శ్రీరమణ చౌరస్తాలో దారి మళ్లింపు సూచిక

- అంబర్‌పేటలో గందరగోళంగా దారి మళ్లింపులు
- ప్రధాన రోడ్డుకు తోడు చిన్న గల్లీల్లో సైతం వెళ్లలేని పరిస్థితి
- బురుజు గల్లి, రెడ్‌బిల్డింగ్ చౌరస్తాలో రోడ్ల తవ్వకాలతో మరింత జటిలంగా మారిన రాకపోకల సమస్య



రెడ్ బిల్డింగ్ చౌరస్తాలో..

అంబర్‌పేట: అంబర్‌పేట మీదుగా వచ్చే వాహనదారులకు దారులు మూసుకుపోవడంతో ఎటు వెళ్లాలో అర్థంకాక దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. అంబర్‌పేట మీదుగా వరంగల్ జాతీయ రహదారి ఉండడంతో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అంతేకాకుండా రామాంతపూర్, ఉప్పల్, దిల్‌షుక్‌నగర్ ప్రాంతాలకు వెళ్లాలనుకునే వారు అంబర్‌పేట మీదుగానే వెళ్లాల్సి ఉంటుంది. దీంతో కార్లు, బస్సులతో పాటు ద్విచక్ర వాహనాదారులు సైతం నిత్యం ట్రాఫిక్‌తో పాటు దారులు మూసుకుపోవడంతో వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. అధికారులు సమన్వయంతో సమస్యను త్వరగా పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

అంతా కలిసి సమస్య తెచ్చిపెట్టారు..

రెండేళ్లుగా అంబర్‌పేట ప్రధాన రోడ్డులో ఫ్లైఓవర్ పనులు జరుగుతున్నాయి. నిర్మాణ సమయంలో ఇప్పటికే పలు దఫాలుగా ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టారు. బ్రిడ్జి నిర్మాణంలో కీలక ప్రాంతమైన శ్రీరమణ చౌరస్తా నుంచి ఛే నంబరు వరకు మధ్యలో ఉన్న ముస్లిం శ్మాసన వాటికల మీదుగా నిర్మాణం సాగాలి. ప్రస్తుతం ఇక్కడి ప్రాంతంలో పనులు చేపట్టేందుకు వారం రోజులు క్రితం ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టారు. దీంతో దిల్‌షుక్‌నగర్, రామంతాపూర్ రెండు ప్రాంతాల వైపు వెళ్లే వాహనాదారులకు దారి లేకుండా పోయింది. ప్రత్యామ్నాయంగా బాగ్‌అంబర్‌పేర్‌పేట బురుజు గల్లీలోకి కనీసం ద్విచక్ర వాహనదారులు వెళ్లాలనుకునే వారికి అక్కడ కూడా డ్రైనేజీ పైప్‌లైన్ పనులు చేపట్టడడంతో దారి లేకుండా పోయింది. అలాగే బాగ్‌అంబర్‌పేట వినాయక్‌నగర్ చౌరస్తా మీదుగా రెడ్‌బిల్డింగ్ డీడీ కాలనీ మీదుగా వెళ్దామనకునే వాహనదారులకు అక్కడ కూడా చిక్కు ఎదురవుతుంది. రెడ్‌బిల్డింగ్ చౌరస్తా నుంచి డీడీ కాలనీ వెళ్లి మలుపు వద్ద జీహెచ్‌ఎంసీ వారు సీసీ రోడ్డు కోసం తవ్వారు. అలాగే పాచమ్మ బస్తీలో సైతం సీసీ రోడ్డు కోసం రోడ్డు తవ్వడంతో చిన్న చిన్న గల్లీల్లో నుంచి ద్విచక్ర వాహనాదారులు బయటపడుతామనుకున్నా వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి.

ప్రత్యామ్నాయం లేకుండా మళ్లింపు..

ఫ్లైఓవర్ పనులతో వాహనదారులు ఇబ్బందులు పడకుండా ప్రత్యామ్నాయ మార్గలు ఏర్పాటు చేయాలి. అనంతరం పనులు ప్రారంభించాలి. అధికారులు ప్రత్యామ్నాయ మార్గలను గుర్తించినప్పటికీ అవి నేటికీ అందుబాటులోకి రాలేదు. అలీకేఫ్ చౌరస్తా నుంచి నాగోలుకు మూసీ నది పక్క నుంచి రోడ్డు వేసినప్పటికీ అది ఇంకా పూర్తి కాలేదు. దీంతో వాహనాదారులకు ప్రత్యామ్మాయ లేకుండా పోయింది. ఉన్న చిన్నపాటి ప్రత్యామ్నాయ రోడ్లపై తవ్వకాలు చేపట్టడడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మా వంతు చర్యలు తీసుకుంటున్నాం..

ట్రాఫిక్ మళ్లింపు, రోడ్ల తవ్వకాలతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తున్నాయి. మా పరిధి కానప్పటికీ వాహనదారులకు ఉపశమనం కలిగేలా తోడ్పాటునందిస్తున్నాం. కీలకమైన ప్రాంతాల్లో మా సిబ్బందిని నియమించాం. ఇతర పోలీస్ స్టేషన్ నుంచి అదనంగా సిబ్బందిని తీసుకువచ్చి వాహనదారులు ఇబ్బందులు పడకుండా కృషి చేస్తున్నా.

– అంబర్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లెనిన్ బాబు

త్వరగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటా

ముందు నిర్ణయించిన అభివృద్ధి పనులు కావడంతో రోడ్ల తవ్వకాలు చేపట్టాం. ఫ్లైఓవర్ కోసం ట్రాఫిక్ మళ్లింపు చర్యలపై మాకు సమాచారం లేదు. రెడ్‌బిల్డింగ్, పోచమ్మబస్తీ ప్రాంతాల్లో తవ్విన రోడ్డు పనులు సత్వరమే పూర్తి అయ్యేలా కృషి చేస్తా.

– జీహెచ్‌ఎంసీ సర్కిల్–16 డీఎంసీ మారుతి దివాకర్

బీఆర్‌ఎస్‌కు గుణపాఠం తప్పదు



మాట్లాడుతున్న డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్

కాచిగూడ: ముదిరాజ్ కులస్తులకు బీఆర్‌ఎస్ పార్టీ ఒక్క సీటు కూడా కేటాయించకపోవడంపై తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్ తీవ్రంగా ఖండించారు. గురువారం నారాయణగూడలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ముదిరాజ్‌లను విస్మరించిన బీఆర్‌ఎస్ పార్టీకి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ముదిరాజ్ బిడ్డలంతా పార్టీలకతీతంగా సంఘాలకు అతీతంగా బీఆర్‌ఎస్ పార్టీకి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని డాక్టర్ చొప్పరి శంకర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు బీఆర్ ఆంజనేయులు, పల్లెపాటి సత్యనారాయణ, రాష్ట్ర ప్రధానకార్యదర్శి బొళ్ల కరుణాకర్, యూత్ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మరగోని రాజు ముదిరాజ్, అధికార ప్రతినిధి కొటికె రాము ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

29న ప్రగతి భవన్ ముట్టడిస్తాం

కాచిగూడ: మున్నూరుకాపుల సంక్షేమం, సమగ్రాభివృద్ధికి రూ.5వేల కోట్లతో ప్రత్యేకంగా మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని మున్నూరుకాపు ఆత్మగౌరవ మహాధర్నా సేన తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ ఉగ్గే శ్రీనివాస్ పటేల్ డిమాండ్ చేశారు. కాచిగూడలోని మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహాన్ని ఎండోమెంట్ పరిధి నుంచి తొలగించి మున్నూరుకాపులకు అప్పగించాలని ఆయన సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. కాచిగూడలో గురువారం ఆయన మాట్లాడుతూ తమ డిమాండ్లను పరిష్కరించాలని వివిధ రూపాల్లో ఇప్పటి వరకు ధర్నాలు, ఆందోళనలు, అసెంబ్లీ ముట్టడి, కలెక్టరేట్ల ముట్టడి చేసినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకుండా పోయిందని ఆరోపించారు. తమ సమస్యలను విన్నవించుకోవడానికి ఈనెల 29వ తేదీ లోగా సీఎం కేసీఆర్ అపాయింట్‌మెంట్ ఇప్పించాలని, లేని పక్షంలో 29న ప్రగతి భవన్‌ను ముట్టడిస్తామని ఆయన తెలిపారు. మున్నూరుకాపు ఆత్మగౌరవ మహాధర్నా సేన తెలంగాణ కో కన్వీనర్లు కటికం మహేష్, బత్తుల రాములు, రామిని సందీప్, వెంపటి సోమన్న, ఆరెకెల సుధా, తోట అలివేలు, వసుందర, కట్లకుంట్ల రాంచంద్రం, దస్తగిరి, కొందారపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

‘అభినందన’ ఎక్సలెన్సీ అవార్డుల ప్రదానం



చిక్కడపల్లి: అవార్డులు ప్రోత్సాహాన్ని అందిస్తాయని వక్తలు పేర్కొన్నారు. అభినందన సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభలో అభినందన కల్చరల్ ఎక్సలెన్సీ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి హాజరై ఎంపిక చేసిన పలువురు ప్రముఖులకు అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పురస్కార గ్రహీతలు పొత్తూరి సుబ్బారావు, అత్తలూరి విజయలక్ష్మి, సాధన నరసింహాచారి, రఘుశ్రీ పాల్గొన్నారు. అనంతరం నంది అవార్డు గ్రహీత శశికళాస్వామి సినీ సంగీత విభావరి సభికులను అలరించింది. సభలో మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు శ్రీమణి, డాక్టర్ భవాని పాల్గొన్నారు.

పాలాభిషేకం



ముషీరాబాద్: దళిత బంధు మాదిరిగానే బీసీ సామాజికవర్గానికి చెందిన 14 కుల వృత్తుల వారికి రూ.లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించి వారి జీవితాల్లో నింపారని పలువురు బీఆర్‌ఎస్ నేతలు కొనియాడారు. గురువారం బీసీ బంధు లబ్ధిదారులు బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు శ్యామ్‌సుందర్ చిట్టి ఆధ్వర్యంలో అడిక్‌మెట్‌లో కేసీఆర్, ఎమ్మెల్యే ముఠా గోపాల్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు బల్ల శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు కొండపల్లి మాధవ్, సయ్యద్ అస్లాం, కార్యదర్శి సురేష్, పున్న ప్రవీణ్, గురుదీప్‌సింగ్, ప్రకాష్ దేవుడా, ఆదిత్, మాణిక్ ప్రభు, సత్యనారాయణ, గిరి, నాగులు, జ్ఞానీ, అస్లాం, లక్ష్మణ్, లాల్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి



మాట్లాడుతున్న ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ఎమ్మెల్యే రాజీవ్ గుమ్బర్

అంబర్‌పేట: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని ఉత్తరప్రదేశ్ సహారాన్పూర్ నగర్ ఎమ్మెల్యే రాజీవ్ గుమ్బర్ సూచించారు. గురువారం బాగ్‌అంబర్‌పేట డివిజన్ బీజేపీ చుక్క జగన్ ఆధ్వర్యంలో జరిగిన పార్టీ సమావేశానికి ఆయన ముఖ్య అతిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ పాలనలో పేదల అభ్యున్నతి జరిగిందన్నారు. బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతంరావు, గద్వాల జిల్లా ఇన్‌చార్జి వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి, నాయకులు శ్యామ్‌రాజ్, గోవర్ధన్‌రెడ్డి, అచ్చిని రమేష్, సురేష్, వెంకటేశ్ ముదిరాజ్ పాల్గొన్నారు.

బీజేపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలి



మాట్లాడుతున్న అస్సాం రాష్ట్ర బీజేపీ ఎమ్మెల్యే పరమానంద్‌జీ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అభ్యర్థి ఎవరైనా ముషీరాబాద్ నియోజకవర్గంలో బీజేపీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ అంకితభావంతో పని చేయాలని బీజేపీ ఎన్నికల పరిశీలకులు, అస్సాం రాష్ట్ర బీజేపీ ఎమ్మెల్యే పరమానంద్‌జీ సూచించారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని సైబర్ హుడ్ కమ్యూనిటీహాల్‌లో రాంనగర్ డివిజన్ ముఖ్య నాయకుల సమావేశం డివిజన్ అధ్యక్షులు కలకోట అరుణ్, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చాతిరి పార్ధసారధిల ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథిగా పరమానంద్‌జీ మాట్లాడుతూ.. ఎన్నికలకు పార్టీ నాయకులు, కార్యకర్తలందరూ సిద్ధం కావాలన్నారు. పార్టీ అధిష్టానం సూచన ప్రకారం డివిజన్‌లోని అన్ని పోలింగ్ బూత్‌లకు పార్టీ కమిటీలను నియమించి వారిని ఎన్నికలకు సిద్ధం చేయలన్నారు. రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ రవిచారి మాట్లాడుతూ.. పార్టీ అభ్యర్థి ఎవరైనా వారి గెలుపునకు కృషి చేస్తామన్నారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చాతిరి పార్ధసారధి మాట్లాడుతూ.. సీనియర్లకు పోటీ చేసే అవకాశం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో సికింద్రాబాద్ జిల్లా ఇన్‌చార్జి నాగురామ్‌నామోజీ, బీజేపీ ముషీరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ రమేష్‌రామ్, బీజే వైఎం రాష్ట్ర మాజీ అధ్యక్షులు జి.భరత్‌గౌడ్, నాయకులు జైపాల్‌రెడ్డి, ఉపేందర్, గడ్డం నవీన్, శక్తిసింగ్, రఘునాథ్, బెజవాడ రవీందర్, జ్యోతిరమ, ధనలక్ష్మి, గోపి తదితరులున్నారు.

సీసీ కెమెరాలతో నేరాలకు చెక్

అంబర్‌పేట: సీసీ కెమెరాలతో నేరాలకు చెక్ పెట్టవచ్చని బీఆర్‌ఎస్ మాజీ కార్పొరేటర్ పద్మావతిరెడ్డి అన్నారు. గురువారం గోల్నాక అంబేడ్కర్‌నగర్‌లో సాయిబాబా ఆలయానికి ఆమె 6 సీసీ కెమెరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు దుర్గప్రసాద్‌రెడ్డి, బస్తీవాసులు నాగరాజు, నరేందర్, నర్సింగ్ తదితరులు ఉన్నారు.

‘బీసీలకు ప్రాధాన్యమివ్వని పార్టీలను ఓడిస్తాం’



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీసీ సంఘాల నాయకులు

ముషీరాబాద్: అసెంబ్లీ ఎన్నికలకు జనాభా దామాషా పద్ధతి ప్రకారం బీసీలకు సీట్లు కేటాయించని రాజకీయ పార్టీలను ఓడిస్తామని బీసీ కులసంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్‌చారి హెచ్చరించారు. గురువారం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడు కులకచర్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో హైదరాబాద్ లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన కుందారం గణేషాచారి మాట్లాడుతూ.. కేసీఆర్ బీసీలను నమ్మించి మోసం చేశారన్నారు. 60శాతం ఉన్న బీసీ జనాభాకు 23 అసెంబ్లీ టికెట్లు కేటాయించి బీఆర్‌ఎస్ బీసీల వ్యతిరేక పార్టీగా నిరూపించిందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షులు తాటికొండ విక్రమ్‌గౌడ్, బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు కనకాల శ్యామ్ కుర్మ, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షులు మణిమంజరి, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గౌడుగు మహేష్ యాదవ్, వర్కింగ్ ప్రసిడెంట్ శ్రీనివాస్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మాదేశి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

రెండవ ఏఎన్‌ఎంల సమస్యలను పరిష్కరించాలి



నోటిఫికేషన్ ప్రతులను దహనం చేస్తున్న రెండవ ఏఎన్‌ఎంలు

కాచిగూడ: దీర్ఘకాలికంగా, అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను గత తొమ్మిది రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా రెండవ ఏఎన్‌ఎంలు తమ విధుల్ని బహిష్కరించి నిరవధిక సమ్మె నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎస్.బాలరాజ్ విమర్శించారు. గురువారం రెండవ ఏఎన్‌ఎం యూనియన్ ఆధ్వర్యంలో రాత పరీక్షల కోసం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్ పత్రాలను హిమాయత్‌నగర్ వై జంక్షన్ వద్ద దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్నికలు, ప్రభుత్వ ఏర్పాటుపై ఉన్న శ్రద్ధ రాష్ట్రంలో ఉన్నటువంటి ప్రజలు,కార్మికులపై లేదని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రకాల ఉద్యోగులు, కార్మికులు తమ ఉద్యోగాల క్రమబద్ధీకరణకై, జీతాల పెంపుకై పోరాటాలు నిర్వహిస్తున్న అవేవీ పట్టనట్టుగా ప్రభుత్వం వ్యవహరించడం అన్యాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో బొడ్డుపల్లి కిషన్, జె.నాగమణి, కె.లలిత, పి.అండాలు, తిరుపతమ్మ, సునంద, గణపతి, మహేశ్వరి పాల్గొన్నారు.

ఆక్యుపంచర్‌లో మరో డిగ్రీ పొందిన జనార్దన్



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సీనియర్ ఆక్యుపంచరిస్ట్ హీలర్ జనార్దన్ అడ్వాన్స్ డిప్లొమా ఇన్ ఆక్యూపంచర్, నేచోరోపతిలో సర్టిఫికెట్‌ను పొందారు. ఈ కాన్వకేషన్ సర్టిఫికెట్‌ను చెన్నైకి చెందిన వెల్‌నెస్ అకాడమీ అధిపతి డాక్టర్ పోన్ను రాజా నుంచి పొందినట్లు ఆయన గురువారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని క్లినిక్‌లో వివరించారు. ఈ సర్టిఫికెట్‌ను పొందడం చాలా ఆనందంగా ఉందని ఈ ఆక్యుపంచర్‌లో చక్కని విజ్ఞానాన్ని అందించిన ఇతర ఫ్యాకల్టీ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కోర్సు ద్వారా డైట్, న్యూట్రిషన్, న్యాచురోపతికి సంబంధించిన అంశాలపై కూడా నైపుణ్యత పొందినట్లు తెలిపారు.

నూతన కార్యవర్గం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాలేజ్ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ నూతన కార్యవర్గాన్ని గురువారం కళాశాలలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సొసైటీ అధ్యక్షుడిగా నానేపల్లి జగ్గారావు, ఉపాధ్యక్షుడిగా ఎన్.కుమారస్వామి, కార్యదర్శిగా ఎన్.వెంకటేష్, కోశాధికారిగా ఎన్.రఘు, మెనేజింగ్ కమిటీ సభ్యులుగా జె.అన్నపూర్ణ, జి.కాంచనమాల, ఎం.జగయ్య, బి.శ్రీధర్, సి.రాజు ఎన్నికయ్యారు. అనంతరం జగ్గారావును సన్మానించారు.



జగ్గారావును సత్కరిస్తున్న దృశ్యం

‘సంభాషణ’ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న చిలివేరు యాదగిరి

కాచిగూడ: శతాధిక గ్రంథకర్త, సామాజిక తత్వవేత్త బీఎస్. రాములు రచించిన ‘సంభాషణ’ పుస్తకాన్ని గురువారం పద్మశాలి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చిలివేరు యాదగిరి ఆవిష్కరించారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ పుట్ట పాండురంగయ్య తొలి ప్రతిని స్వీకరించారు. నారాయణగూడలో జరిగిన కార్యక్రమంలో చిలువేరు యాదగిరి మాట్లాడుతూ.. సామాజిక చైతన్యానికి ఈ పుస్తకం ఎంతో తోడ్పడుతుందన్నారు. బడుగు, బలహీన వర్గాల సామాజిక, రాజకీయ చైతన్యాన్ని ఈ పుస్తకం పరిచయం చేస్తుందన్నారు. తెలంగాణ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీఎస్. రాములు బహుముఖ ప్రతిభాశాలి అని, వారి సేవలు సమాజానికి, ప్రభుత్వానికి ఎంతో అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో రచ్చ శ్రీనివాస్, పులిపాటి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కబడ్డీ, ఖోఖో పోటీలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న చిరంజీవి, శ్రీలత తదితరులు

ముషీరాబాద్: రెండు రోజుల పాటు ఉస్మానియా యూనివర్సిటీ ప్రాంగణంలోని మోడల్ హైస్కూల్‌లో ముషీరాబాద్ మండల స్థాయి కబడ్డీ, ఖోఖో టోర్నమెంట్ 2023–24లు జరిగాయి. ఈ ముగింపు వేడుకల్లో డిప్యూటీ ఈఓ చిరంజీవి, మండల స్థాయి స్కూల్ గేమ్స్ మాజీ సెక్రటరీ కిషోర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీలత, పీఈటీలు, హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు. అండర్–17 బాలికల ఖోఖో విభాగంలో సెయింట్ పాయిస్ విద్యార్థులు ప్రథమ స్థానాన్ని కై వసం చేసుకున్నారు. ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 2వ స్థానాన్ని సాధించారు. అండర్ 17 బాలుర విభాగంలో ఎంజీహెచ్‌ఎస్ విద్యార్థులు మొదటి స్థానాన్ని, ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల రెండవ స్థానాన్ని, కాకతీయ హై స్కూల్ కవాడిగూడ 3వ స్థానాన్ని దక్కించుకున్నాయి. అదే విధంగా అండర్–14 బాలికల ఖోఖో విభాగంలో ముషీరాబాద్ హైస్కూల్ మొదటిస్థానం, ఓయూ మోడల్ హై స్కూల్ 2వ స్థానం, సెయింట్ పాయిస్ విద్యార్థులు 3వ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. అండర్ 14 బాలుర విభాగంలో సెయింట్ ఫ్రాన్సిస్ రాంనగర్ విద్యార్థులు మొదటి స్థానం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల కవాడిగూడ ద్వితీయ స్థానం, ముషీరాబాద్ గవర్నర్‌మెంట్ హై స్కూల్ 3వ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేసి అభినందనలు తెలిపారు.

చంద్రయాన్–3 విజయోత్సవం



కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో ప్రిన్సిపాల్ వైఎస్ స్వర్ణలత

కాచిగూడ: చంద్రయాన్–3 విజయవంతంగా చంద్రమండలంపై దిగిన సందర్భంగా కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థులు విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. చద్రయాన్ విజయవంతంగా ప్రయోగం కావడంపై మన శాస్త్రవేత్తలు చేసిన కృషిని ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వైఎస్ స్వర్ణలత విద్యార్థులకు వివరించారు. చంద్రయాన్ విజయవంతం కావడంతో ప్రపంచ దేశాలన్నీ భారతదేశం శాస్త్ర సాంకేతిక ప్రవీణ్యత, గొప్పతనాన్ని గుర్తించాయని ఆమె చెప్పారు. చంద్రయాన్–3 మిషన్‌లో పాల్గొన్న శాస్త్రవేత్తల కృషిని ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్స్ ప్రసాద్‌రావు, రాధిక, రజనీ, గీతాబాయి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మయ్య, రామ్మోహన్ పాల్గొన్నారు.

కాచిగూడలో..

చంద్రయాన్ విజయవంతమైనందుకు బీఆర్‌ఎస్ పార్టీ కాచిగూడ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర భీష్మ దేవ్ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు గురువారం కాచిగూడ చౌరస్తాలో సంబరాలు జరుపుకున్నారు. స్వీట్స్ పంపిణీ చేసి, బాణాసంచా కాల్చారు. చంద్రయాన్ విజయవంతం కావడం భారతదేశానికి గర్వకారణమని, ఈ దేశంలో పుట్టినందుకు ప్రతి భారత పౌరుడు గర్వించదగ్గ పరిణామమని ఎర్ర భీష్మదేవ్ పేర్కొన్నారు.

రాంనగర్ చౌరస్తాలో..

ముషీరాబాద్: రాంనగర్ చౌరస్తాలో ఎండీ వాజిద్, నజీయాల ఆధ్వర్యంలో సంబరాలు జరిపారు. రాంనగర్ మాజీ కార్పొరేటర్, ట్రేడ్ యూనియన్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. చంద్రుడి ఉపరితలంపై సురక్షితంగా చంద్రయాన్–3 ల్యాండ్ కావడం మన శాస్త్రజ్ఞులు సాధించిన విజయం అన్నారు. శ్రీనివాస్, సిరిగిరి శ్యామ్, సత్యనారాయణ, సాయి, వెంకటేష్, నవీన్‌నాయక్, ప్రవీణ్, రాజ్, కల్పన, సానమ్మ, సబిత తదితరులు పాల్గొన్నారు.



రాంనగర్ చౌరస్తాలో..శ్రీనివాస్‌రెడ్డి తదితరులు